
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 10 ఆగస్టు 2025

నోటుకు వేళాయె..!

- పులివెందులలో ఓటుకు ఎంత ఇచ్చేందుకైనా వైసీపీ రెడీ
- ఒంటిమిట్టలో రూ.2వేలు వంతున పంపిణీ షురూ
- పులివెందుల, ఒంటిమిట్టలో మంత్రుల ప్రచారం
- బెంగళూరు కేంద్రంగా వైసీపీ వ్యూహ రచనలు
- నేటితో ప్రచారానికి తెర





జిల్లాలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలను తలపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు జరిగిన ఏడాది తర్వాత పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు ఉపఎన్నికలు సాగుతున్నాయి. ఇవి ఉప ఎన్నికల మాదిరి లేవు. అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లాగా ఇరుపార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఆదివారం సాయంత్రంతో ప్రచారానికి తెరపడనుంది. దీనితో శనివారం పులివెందుల, ఒంటిమిట్టల్లో టీడీపీ, వైసీపీ విస్తృతంగా ప్రచారం చేశాయి. ఈ ఎన్నికలను ప్రతిష్ఠగా తీసుకున్న వైసీపీ ఓటుకు ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీవర్గాల ద్వారా సమాచారం అందుతోంది. పులివెందులలో అయితే ఓటుకు రూ.10వేలు కూడా ఇచ్చేందుకు సిద్ధమైందని, అయితే టీడీపీ ఎంతిచ్చినా సరే అంతకన్నా అదనంగా రూ.2వేలు ఇవ్వాలంటూ బెంగళూరు నుంచి ఆదేశాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇక ఒంటిమిట్టలో ఓటుకు రూ.2వేలు వంతున పంపిణీ మొదలు పెట్టారని సమాచారం.

కడప, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికలలో ఉమ్మడి జిల్లాలో ఏడు అసెంబ్లీ సీట్లు కోల్పోయింది. ఏడాది తర్వాత జగన్ సొంత జిల్లాలో జరిగే ఉప ఎన్నికలో ఓడిపోతే రాష్ట్రంలో పెద్ద మైనస్ అవుతుంది. అందుకే ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలను వైసీపీ జీవన్మరణ సమస్యగా తీసుకుంది. బెంగళూరు నుంచి అందిన ఆదేశాల మేరకు ఎంపీ అవినాశ్‌రెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, మేయర్ సురేశ్‌బాబు, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన ముఖ్యనేతలు పులివెందులలో తిష్టవేశారు.

వందరోజుల్లో హామీల అమలు

పులివెందుల జడ్పీటీసీని ఇంతవరకు టీడీపీ గెలుచుకోలేదు. అయితే తొలిసారి వైసీపికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. బీటెక్ రవి సతీమణి లతారెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడ కూటమి ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ఆర్.మాధవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సమిష్టిగా టీడీపీ గెలుపునకు శ్రమిస్తున్నారు. శనివారం అనకాపల్లె ఎంపీ సీఎం రమేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పులివెందులలో రోడ్‌షో నిర్వహించారు. టీడీపీని గెలిపిస్తే ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లోనే నెరవేరుస్తామంటూ గట్టిగా హామీ ఇచ్చారు. ముఖ్యంగా యర్రబల్లె చెరువుకు నీళ్లు వస్తే చుట్టుపక్కల పది గ్రామాలకు సాగు, తాగునీరు వస్తుంది. దానిని జగన్ హయాంలో పట్టించుకోలేదు. పెండింగ్ పనులు ఈనెలాఖరు లోపు పూర్తి చేసి నీరు ఇస్తామని సభాముఖంగా మంత్రితో సహా అందరూ హామీ ఇచ్చారు. వైసీపీ నుంచి వరుస చేరికలతో టీడీపీ నేడు బలంగా కనిపిస్తోంది.

ఒంటిమిట్టలో వైసీపీ నుంచి టీడీపీలోకి..

ఒంటిమిట్టలో శనివారం టీడీపీ విస్తృత ప్రచారం నిర్వహించింది. మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఫరూక్, ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు, ఇతర టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. ఒంటిమిట్ట ఎంపీపీ లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు గీతాదేవి టీడీపీలో చేరారు. వైసీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, పెన్నపేరూరు గ్రామానికి చెందిన సుమారు వంద మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే మల్లకాటుపల్లెకు చెందిన వైసీపీ నేతలు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పెద్దఎత్తున టీడీపీలో చేరడంతో వైసీపీకి షాక్ కొట్టినట్లు చెబుతున్నారు. దీంతో ఓటర్లకు శనివారం నుంచే వైసీపీ రూ.2వేల చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం.

ఓటుకు ఎంతైనా ఓకే

పులివెందుల జడ్పీటీసీ పరిధిలో 10,560 ఓట్లు ఉన్నాయి. ఇక్కడ ప్రతి ఓటు కీలకం. ఈ స్థానాన్ని గెలుచుకుని రావాలని ఇటీవల టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇది వైసీపీలో వణుకు పుట్టిస్తోంది. అందుకే ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. వైసీపీ అయితే పల్లెల్లో ఓటుకు రూ.10వేలు ఇచ్చి అయినా కొనుగోలు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. టీడీపీ కూడా వైసీపీ స్థాయిలోనే ఇచ్చేందుకు సిద్ధమైనట్లు చర్చ నడుస్తోంది. అయితే .. టీడీపీ ఎంతిచ్చినా సరే అదనంగా రూ.2వేలు ఇవ్వాలని బెంగళూరు నుంచి ఆదేశాలు చేరడంతో పంపిణీలో వైసీపీనే పైచేయి సాధించేలా ఉంది. నేటితో ప్రచారం ముగియనుంది. ప్రచారం ముగిశాక ఎన్నికలు జరిగేరోజుకు మధ్యలో ఉండే సమయమే పంపకాలకు కీలకం. ఏదిఏమైనా టీడీపీ, వైసీపీ ఈ ఉప ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని చావోరేవో అనేలా తలపడుతున్నాయి.

రేపు కలెక్టరేట్‌లో మీకోసం రద్దు

కడప కలెక్టరేట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ ఉపఎన్నికల నేపథ్యంలో కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున 11వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీదారులు రావద్దని, ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని డీఆర్వో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో 8 మంది అరెస్టు

పులివెందుల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండువారిపల్లెలో ధనుంజయ అనే వ్యక్తిని కులంపేరుతో దూషించిన కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేశామని ఎస్ఐ నారాయణ తెలిపారు. నాలుగురోజుల క్రితం నల్లగొండువారిపల్లెలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ధనుంజయను కులంపేరుతో దూషించి దాడి చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మునిచంద్ర, వారుబోయిన మనోహర్, ముచ్చకట్ల చంద్రబాబునాయుడు, సత్యం గుండాలయ్య, సిరిగిరెడ్డి గంగిరెడ్డి, క్రిస్టపాటి గంగిరెడ్డి, చాగుంట గోపాల్, ముడియాల అంకాల్‌రెడ్డిలను అరెస్టు చేసి పులివెందుల సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ అన్నారు. వీరికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

పెన్నానదికి 10 వేల క్యూసెక్కుల నీరు విడుదల

మైలవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 10 వేల క్యూసెక్కుల నీటిని శనివారం జలాశయ అధికారులు విడుదల చేశారు. ఈఈ రమేశ్, డీఈ నరసింహమూర్తి, ఏఈ సుబ్బారావు, తహశీల్దారు లక్ష్మీనారాయణ మైలవరం జలాశయం వద్ద మూడు గేట్ల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మైలవరం జలాశయం పూర్తిసామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.3 టీఎంసీల నీరు నిలువ ఉంది. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి అయిదు వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మైలవరం జలాశయం నుంచి నీటిని పెన్నానది ద్వారా సోమశిల రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. 10వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండటంతో పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ అధికారులు, పోలీసులు హెచ్చరించారు.



పెన్నానదికి నీటిని విడుదల చేసిన దృశ్యం

కూలిన కల్వర్టు

- బద్వేలు-కడప మధ్య రాకపోకలకు అంతరాయం

సిద్దవటం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బద్వేలు-కడప రహదారిలోని సిద్దవటం దాటాక అటవీ ప్రాంతంలోని సాహెబ్ బావి వద్ద శనివారం మధ్యాహ్నం కల్వర్టు ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కడప నుంచి బద్వేలు, పోరుమామిళ్ల, ఉదయగిరి, నెల్లూరు ప్రాంతాలకు ఇదే దారిలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్టు కూలిపోయిన విషయం తెలియక అటు ద్వేలు వైపు నుంచి ఇటు కడప వైపు నుంచి వెళ్లిన వాహనాలు అడవి మధ్యలో నిలిచిపోయాయి. ఆర్ అండ్ బీ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కల్వర్టు కూలిపోయిందని పలువురు మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు రహదారులపై దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరారు. కాగా.. కూలిపోయిన కల్వర్టు వద్దకు ఆర్ అండ్ బీ అధికారులు, పోలీసులు చేరుకుని రాత్రి 7.30గంటల వరకు శ్రమించి కల్వర్టుకు సమీపంలో ద్విచక్ర వాహనాలు, కార్లు వెళ్లేందుకు తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచి ఇతర వాహనాలు కూడా వెళ్లేలా పనులు చేపడతామన్నారు.




కడప- బద్వేలు రహదారిలోని సాహెబ్ బావి వద్ద కూలిన కల్వర్టు

కన్నుల పండువగా కల్యాణం

కడప కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రవణా నక్షత్రం సందర్భాన్ని పురస్కరించుకుని దేవుని కడపలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుడు ముస్తాబై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు త్రివిక్రమ్, కృష్ణమూర్తి, తరుణ్, రఘునందన్, సాయి వేదమంత్రాలు జపిస్తూ మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తో పాటు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





కల్యాణోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరుడు

పులివెందుల ప్రజలకు ఈసారి..
ఒక్కరోజు ముందే స్వాతంత్ర్యం

- తల్లీ చెల్లెళ్లను దూరం చేసుకున్న వ్యక్తి జగన్
- పులివెందులకంటే పుంగనూరుకు నీరు తీసుకెళ్లడమే జగన్ లక్ష్యం
- కూతుర్ని పులివెందులకు రావద్దంటున్న సౌభాగ్యమ్మ
- రోడ్‌షోలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



పులివెందులలో నిర్వహించిన రోడ్‌షోలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎంపీలు సీఎం రమేశ్, శబరి, ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ అభ్యర్థి లతారెడ్డి తదితరులు

పులివెందుల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రజలకు ఈసారి ఒక్కరోజు ముందే స్వాతంత్ర్యం రాబోతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె, ఆర్.తుమ్మలపల్లె, అచ్చవెల్లి తదితర గ్రామాలలో కూటమి నేతలు రోడ్‌షో నిర్వహించారు. ఈ రోడ్‌షోలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ ప్రజలందరూ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొంటారన్నారు. పులివెందుల ప్రజలకు మాత్రం ఆగస్టు 14నే స్వాతంత్ర్యం రాబోతోందన్నారు. పులివెందులలో 2019, 2024 ఎన్నికల్లో జగన్‌కు ఎన్ని ఓట్లు వచ్చాయో చూశామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని గొడ్డలితో నరికి నరికి చంపారని షర్మిలనే చెబుతోందన్నారు. సునీతను పులివెందులకు రావద్దని సౌభాగ్యమ్మే చెబుతున్నారంటే మరి ఎంతగా భయపడుతున్నారో తెలుస్తోందన్నారు. అసెంబ్లీ జరుగుతోంటే అటువైపు కూడా చూడకపోవడం దారుణమన్నారు. రాయలసీమకు సాగు, తాగునీరు ఇచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. ఈ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందరోజుల్లో పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చెప్పారన్నారు.

అనంతరం అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌నాయుడు మాట్లాడుతూ జగన్‌కు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నా ఈరోజు రాఖీ కట్టించుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలంతా జగన్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. పులివెందుల ప్రజలకు జగన్‌కు బుద్ధిచెప్పే అవకాశం వచ్చిందన్నారు. జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో మారెడ్డి లతారెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ 48 గంటల్లో యర్రబల్లెచెరువుకు నీరు అందించే పనులు పూర్తిచేశామంటే ఇక్కడి ప్రజలపైన ముఖ్యమంత్రికి ఉన్న అభిమానం ఎలాంటిదో చూడాలన్నారు. గతంలో చీనీ, అరటి వ్యాపారాల్లో సూటు, కమిషన్ పేరుతో రైతులను దోచేసేవారన్నారు. వాటిని సమూల మార్పులు చేశామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ రైతులకు సాగునీరు అవసరమని చెప్పిన వెంటనే స్పందించిన నాయకుడు చంద్రబాబు అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజల భవిష్యత్తు బాగుండాలన్నా అది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అరటి రైతులకు ఎన్నికల కోడ్ ఎత్తేయగానే రూ.83లక్షలు ప్రభుత్వం పరిహారం చెల్లించబోతోందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ పులివెందులలో టీడీపీని గెలిపిస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. బెదిరింపులకు భయపడకుండా ముందుకు సాగాలన్నారు. పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల కంటే పుంగనూరుకు నీరు తీసుకెళ్లడమే జగన్ లక్ష్యమన్నారు. యర్రబల్లెచెరువుకు సంబంధించిన సమస్య తమ దృష్టికి తెచ్చిన 48 గంటల్లోనే పరిష్కారం చూపామన్నారు. ఈ నెలాఖరులోగా యర్రబల్లెచెరువుకు నీరు వస్తుందన్నారు. మీ అందరికి అండగా ఉండేందుకు లతారెడ్డిని గెలిపించాలని కోరారు. పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బద్వేల్ ఇన్‌చార్జి రితీశ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేతలు లక్షుమయ్య, వాజ్‌పేయి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్త జనసంద్రంగా గండి

చక్రాయపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రం మూడవ శ్రావణ శనివారం భక్త జనసంద్రంగా మారింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో తెల్లవారుజామున 5గంటల నుంచే క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. దాదాపు 80వేల నుంచి లక్ష మంది భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం 6గంటల వరకు క్యూలన్నీ కిటకిటలాడాయి. ఇటు వీరన్నగట్టుపల్లె, అటు అద్దాలమర్రి వరకు భక్తులు బారులు తీరారు. వీఐపీ దర్శనం, సర్వదర్శనానికి ఐదు గంటలు పట్టింది. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేశ్ ఆంజనేయస్వామిని తోమాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చిన భక్తులకు బిస్మిల్లాబాద్ వారు, అంకాల్‌రెడ్డి వారు, పల్లం ఆంజనేయులు, గోవిందమాల, ఆంజనేయస్వామి సేవా సమితి రామచంద్రతో పాటు పలువురు అన్నదానం చేశారు. దేవస్థానం వారు కూడా వేలాది మందికి భోజన సౌకర్యం కల్పించారు. సీఐ ఉలసయ్య, ఎస్ఐలు రంగారావు, భాస్కర్‌రావు, చంద్రశేఖర్‌లు భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తుల కాలక్షేపం కోసం కోలాటాలు, హరికథాకాలక్షేపాలు, నాటకాలు కూడా ఏర్పాటుచేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి



గండి క్షేత్రంలో భక్తుల రద్దీ

మూడేళ్లలో స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభం

- నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి వెల్లడి

జమ్మలమడుగు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ స్టీల్‌ప్లాంట్ కల నెరవేరబోతోందని మూడేళ్లలో ఇక్కడ ఉత్పత్తి ప్రారంభం కానుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఉదయం 9.25 గంటలకు సున్నపురాళ్లపల్లె, కన్నెతీర్థం గ్రామాల మధ్య గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు ముందు భాగంలో జేఎస్‌డబ్ల్యూ ఇంజనీర్లతో కలసి స్టీల్‌ప్లాంట్ ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో గుంత తీసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు సంవత్సరాల్లో ఈ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తులు ప్రారంభం అవుతాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం అడిగినంత భూమి ఇచ్చారన్నారు. 3,300 ఎకరాలు భూమి ఇచ్చారన్నారు. అందులో దాదాపు 1500 విల్లాస్‌లు, రిసార్ట్‌లు, పాఠశాలలు, హెల్త్ సెంటర్ ఏర్పాటు అవుతాయన్నారు. రైతులు ఎవ్వరు టెన్షన్ పడాల్సిన పనిలేదని అన్నారు. కొందరు సరిపోనివారు ఇష్టారాజ్యంగా మాట్లాడడం సరికాదన్నారు. ఇక్కడ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కావడంతో జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు అవుతుందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్‌ప్లాంట్ నిర్మాణం అదిగో ఇదిగో అంటూ పనులు చేయకుండా ప్రజలకు చుక్కలు చూపించారని అన్నారు. రాజకీయాలు పక్కనబెట్టి జమ్మలమడుగులో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం అందరూ సహకరించాలని కోరారు. 12వ తేదీ పులివెందులలో జరిగే జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలవడం గ్యారంటీ అన్నారు.

టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలాగా కాకుండా స్టీల్‌ప్లాంట్ పనులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. 20 శాతం పనులు పూర్తి అయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చి పరిశీలిస్తారన్నారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూపు హెచ్‌ఆర్ డిపార్టుమెంట్ అధికారి సుదర్శన్ మాట్లాడుతూ ప్రస్తుతం తమకు ఇచ్చిన 3,300 ఎకరాల బౌండరీ కోసం భూమిపూజ చేసి ప్రహరీగోడ నిర్మించేందుకు పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు మార్కెట్‌యార్డు యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరెడ్డి, స్థానిక సర్పంచ్ రామాంజనేయరెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ ప్రహరీగోడ పనులకు భూమి పూజ అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, చిత్రంలో భూపేశ్‌రెడ్డి తదితరులు

మత్తులో తూలుతున్న బాలురు

టైర్లకు పంచర్లు వేసే సొల్యూషన్‌ను పీల్చి అనారోగ్యం పాలవుతున్న వైనం



సైకిల్‌కు పంచర్లు వేసే సొల్యూషన్, సొల్యూషన్‌ను గుడ్డలో వేస్తున్న చిన్నారులు

రైల్వేకోడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొందరు బాలురు మత్తులో తూలుతున్నారు. సైకిల్ టైర్ల పంచర్లకు వేసే సొల్యూషన్‌ను పీల్చి అనారోగ్యానికి గురవుతున్నారు. వీధుల్లో పారేసిన ప్లాస్టిక్, ఇనుప సామాన్ల ను సేకరించి వాటితో వచ్చే డబ్బుతో సొల్యూషన్ తీసుకుని పీల్చి మత్తు లోకి జారుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు పట్టణంలో కొందరు అనాథ పిల్లలు ఉన్నారు. వీరు పాఠశాలలకు వెళ్లరు. నిత్యం బయట లభించే పాత సామాన్లు సేకరించి వాటిని అమ్మి టైర్లకు పంచర్లు వేసే సొల్యూషన్‌ను కొనుక్కుని దానిని ఒక గుడ్డలో పలుచగా చేసి నలిపి ముక్కు, నోటి దగ్గర పెట్టుకుని పీల్చుతున్నారు. దీంతో పీల్చిన పది నిమిషాలకు మత్తు వస్తుంది. ఆ మత్తులో వారు ఏమి చేస్తారో వారికే తెలియని పరిస్థితి నెలకొంటోంది.

కొంతమందికి తల్లిదండ్రులు లేక ఇలాంటివి చేస్తుండగా మరికొంత మంది తల్లిదండ్రులు ఇచ్చే ప్యాకెట్ మనీతో మత్తు పదార్థాలకు బానస అవుతున్నారు. ఇదే కాకుండా వైట్‌నర్‌ను కూడా ఉపయోగిస్తున్నారు. ఇవి చాలా తక్కువ ధరకు మార్కెట్‌లో లభిస్తుండటంతో వాటిని వినియోగిస్తున్నారు. చేతిలో డబ్బులు లేని సమయంలో పిల్లలు కత్తితో శరీరంపై గాట్లు పెట్టుకుంటున్నారు. చాలామంది పిల్లలకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఇలాంటి పనులకు అలవాటు పడి మత్తులో ఉంటున్నారు. కొంతమందికి తల్లిదండ్రులు ఉన్నా పట్టించుకోవడం లేదు. చక్కగా చదువుకోవాల్సిన పిల్లలు మత్తుకు అలవాటుపడి తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారు. దీనిపై సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకుని చిన్న పిల్లల ప్రాణాలను కాపాడి వారికి విద్యాబుద్ధులు చెప్పించి ప్రయోజకులు తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

వైదులు ఏమంటున్నారంటే...

సైకిల్ టైర్లకు పంచరు వేసే సొల్యూషన్ పీల్చితే గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు బాగా దెబ్బతింటాయని రైల్వేకోడూరు ప్రభుత్వ డాక్టర్ సాయి తెలిపారు. సొల్యూషన్‌తో ముందు గా ఊపిరితిత్తులు, తర్వాత గుండె, కిడ్నీలు దెబ్బతింటూపోతాయని వివరించారు. చిన్నపిల్లలు మత్తుకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. సొల్యూషన్‌లో పూర్తిగా కెమికల్ ఉంటుంది కాబట్టి వాటిని పిల్లలకు మార్కెట్‌లో అమ్మరాదని చెప్పారు.

చర్యలు తీసుకుంటున్నాం

మత్తుకు అలవాటుపడిన చిన్నపిల్లల సమాచారం తెలుసుకుని గుర్తించి వారిని కడప చిన్న పిల్లల సంరక్షణ కేంద్రానికి తరలించి అన్ని వసతులు కల్పించి వారికి విద్యాబుద్ధులు చెప్పిస్తున్నాము. కలెక్టర్ల ఆదేశాలతో చిన్న పిల్లల బాధ్యతను తీసుకుంటున్నాము. ఇప్పటికే రైల్వేకోడూరులో మత్తుకు అలవాటుపడిన పిల్లలను గుర్తించాము. విద్య, రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖల అధికారులతో రైల్వేకోడూరు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పిల్లలను గుర్తిస్తున్నాము.

\- జిల్లా బాలల సంరక్షణ అధికారి రామలక్ష్మీ

పిడుగుపాటుకు 47 జీవాలు మృతి

● సుమారు రూ.6 లక్షల నష్టం ● టీడీపీ నేత చంద్ర రూ.50 వేల ఆర్థికసాయం



మృతి చెందిన గొర్రెలు, పొట్టేళ్లు - బాధితురాలికి రూ.50 వేల చెక్కును అందచేస్తున్న టీడీపీ నేత దేరంగుల చంద్ర

తంబళ్లపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు 47 మూగ జీవాలు మృతి చెందిన సంఘటన తంబళ్లపల్లె మండలం బోనాసివారిపల్లెలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు..తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండా పంచాయతీ బోనాసివారిపల్లెకు చెందిన మావెళ్ల రెడ్డమ్మ భర్త అంజనప్ప కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో ఆమె 110 వరకు గొర్రెలు, పొట్టేళ్లు మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం రోజు ఎప్పటిలాగానే జీవాలను మేతకు తీసుకువెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటి వెనుక వైపు రేకుల షెడ్డులో తోలింది. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. శనివారం ఉదయం షెడ్డు వద్దకు వెళ్లి చూడగా కొన్ని జీవాలు పడిపోయి ఉండటం గమనించింది. వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులతో వెళ్లి పరిశీలించగా అందులో 47 జీవాలు మృతి చెందగా, మరో 7 జీవాలు లేవకుండా పడిపోయి ఉన్నట్లు వాపోయింది. మృతి చెందిన జీవాల విలువ సుమారు రూ.6 లక్షల పైగా ఉంటుందని బాధితురాలు వాపోయింది.

బ్యాంకులో బంగారు పెట్టి కొంత, స్థానిక రైతుల వద్ద మరి కొంత అప్పు చేసి జీవాలు తెచ్చుకుని మేపుకుంటున్నామని..ఈ ఘటనతో తాము ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా జీవనోపాధి కోల్పోయామని రెడ్డమ్మ, కుటుంబసభ్యులు భోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకుని తమకు సాయం అందించాలని బాధితులు, స్థానికులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న పశు వైద్య శాఖ ఏడీ సుమిత్ర, పశు వైద్యాధికారి విక్రమ్ రెడ్డి, పశు వైద్యురాలు ఇందు వెంటనే గ్రామానికి వెళ్లి మృత్యువాత పడ్డ జీవాలను పరిశీలించారు. కొన్నింటికి పోస్టుమార్టం నిర్వహించి అవయవాలను పరిశీలించారు. కాలేయం, గుండె తదితర అవయవాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. పిడుగుపాటుకు గురై జీవాలు మృతి చెంది ఉండవచ్చని పశువైద్యాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న తెలుగు యువత పార్లమెంటు ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, కూటమి నేతలు గ్రామానికి చేరుకుని టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు చంద్ర తన సొంత నిధులు రూ.50 వేల చెక్కును బాధితురాలికి అందచేశారు. ప్రభుత్వం తరుపున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ఉత్తమ్‌రెడ్డి, సిద్ధమల్ రెడ్డి, గ్రామాధ్యక్షులు నరసింహులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి క్రిష్ణమూర్తి నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, గురుమూర్తి, వార్డు సభ్యులు జగదీష్, జనసేన నేత ఎద్దుల నరసింహులు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



శాంతమ్మ(ఫైల్)

ములకలచెరువు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బైక్‌లో చీర కొంగు ఇరుక్కుని తీవ్రంగా గాయపడిన శాంతమ్మ(45) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. స్థానిక ఇందిరాకాలనీ వాసి పెయింటర్ వెంకటరమణ నాయక్ భార్య శాంతమ్మకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఈ నెల 7వతేదీన తన కుమారుడు వెంట ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళ్లింది. అక్కడ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని తిరిగి ములకలచెరువుకు వస్తుండగా మార్గం మధ్యలో వేపూరికోట వద్ద వెనుక కూర్చున్న శాంతమ్మ చీర కొంగు బైక్ వెనుక చక్రంలో చుట్టుకుని కింద పడింది. ఈ ప్రమాదంలో శాంతమ్మ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం తిరుపతి రూయాకు తరలించారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మహిళ మృతదేహాన్ని ములకలచెరువుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మహిళ మృతితో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదంలో కార్మికుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ బబ్లూ

ములకలచెరువు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మిస్తున్న కల్యాణమండపంలో పనిచేస్తూ కింద పడడంతో బిహార్ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో యువకుడి రెండు కాళ్ళు విరడగంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు... బిహార్‌కు చెందిన బబ్లూ (31) మదనపల్లెలో నివాసముంటూ భవనాలకు పీఓపీ పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ములకలచెరువులోని కదిరి రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న కల్యాణమండపంలో పీఓపీ పనులు చేసేందుకు వచ్చాడు. శనివారం పనిచేస్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రెండు కాళ్లు విరగడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్య సిబ్బంది సూచనల మేరకు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన నీటి పంపింగ్



ప్రాజెక్టులోకి మోటారు దించుతున్న కార్మికులు, అధికారులు

పీలేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే క్రమంలో శనివారం పీలేరు పంచాయతీ అధికారులు మరో ముందడుగు వేశారు. కొంత కాలంగా అనేక ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి శనివారం సాయంత్రం నుంచి పీలేరు మండలం బాలంవారిపల్లె వద్దనున్న గార్గేయ ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్‌ను ప్రారంభించారు.

తొలి విడతలో ఒక మోటారు ద్వారా నీటిని పంపింగ్ చేసి కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లలో నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందిస్తామని డిప్యూటీ ఎంపీడీఓ లతీఫ్ ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో మరో మోటారును కూడా అమర్చుతామని, తద్వారా రెండు, మూడు రోజులకు ఒకసారి పట్టణంలో నీటి సరఫరా చేయగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేనందున ప్రస్తుతం పట్టణంలో సగటున ఎనిమిది రోజులకు ఒకసారి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లు, ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సంయుక్తంగా శ్రమించి మోటారు ద్వారా పంపింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మికులు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



ర్యాలీ చేస్తున్న గిరిజన, యానాది సంఘ నేతలు, సభ్యులు

పీలేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ గిరిజన యానాది సేవా సంఘం, ఏపీ ఆదివాసీ ఎరుకల సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పీలేరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీలేరు ఏఎంసీ ప్రాంగణలో జరిగిన సమావేశంలో ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు జానం గంగిరెడ్డి మాట్లాడుతూ అడవులు, నదులు, పర్వతాలతో కలిసి జీవించిన గిరిజనులు, యానాదులు, ఎరుకల కారణంగా గతంలో పర్యావరణ సమతుల్యత ఉండేదన్నారు. కాలక్రమంలో వారందరూ సంప్రదాయ జీవనశైలికి దూరమైన కారణంగా పర్యావరణ సమతుల్యత గణనీయంగా దెబ్బతినిందన్నారు. ప్రభుత్వాలు తమకు హామీ ఇచ్చిన రాజ్యాంగ హక్కులను అమలు చేయాలని, అటవీ హక్కులు, విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. అంతకుమునుపు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస వర్మ, మహిళా అధ్యక్షురాలు సావిత్రమ్మ, నేతలు కిల్లా విజయ్ కుమార్, క్రాంతి కుమార్, నారాయణమ్మ, రెడ్డప్ప, ఆదినారాయణ, ఈశ్వరయ్య, లోకేశ్, రాజేశ్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదా ఐఏఎస్

కుటుంబ సభ్యులతో కలిసి రాజంపేటలో వాకింగ్



రాజంపేటలో నడుచుకుంటూ వెళుతున్న సబ్ కలెక్టర్ భావన

రాజంపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఐఏఎస్, ఐపీఎస్‌లు అంటే పెద్ద హుందాతనాన్ని పాటిస్తారు. అయితే మూడు రోజుల కింద రాజంపేట సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యువ ఐఏఎస్ అధికారి భావన ఎంతో సాదాసీదాగా కనిపిస్తున్నారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన మూడో రోజే శనివారం సాయంత్రం రాజంపేట ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి తన కుటుంబసభ్యులతో కలిసి మెయిన్‌రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండు వరకు నడుచుకుంటూ వెళ్లారు. ఆర్టీసీ బస్టాండును సందర్శించి అక్కడ పరిస్థితిని స్వయంగా ఆరాతీశారు. తిరిగి అక్కడి నుంచి నడుచుకుంటూ ఆర్అండ్‌బీ బంగ్లాకు వెళ్లారు. ఇటీవల బదిలీపై వెళ్లిన నిధియాదేవి సబ్ కలెక్టర్ కార్యాలయం ఖాళీ చేయడంలో ఆలస్యమవుతుండడంతో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన భావన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గాలివీడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనంలమేరకు.. మండలంలోని కొర్లకుంట పంచాయతీ పెద్ద రెడ్డివారిపల్లెకు చెందిన నిర్జీ శంకరయ్య (38) రజక వృత్తి, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు, మృతునికి నలుగురు ఆడ పిల్లలు సంతానం. కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు కడపలోని రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



సిద్దవటం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భాకరాపేట సమీపంలోని హైవే పక్కన ఉన్న గుర్తు తెలియని వృద్ధురాలు (80) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున వృద్ధురాలు హైవే పక్కన పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో ఆమెను కడప రిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందింది. ఆమె ఆచూకీ తెలిసినవారు ఒంటిమిట్ట సీఐ బాబు 91211 00581, సిద్దవటం ఎస్ఐ 91211 00584 అనే మొబైల్ ఫోన్ నెంబర్లకు సమాచారం తెలపాలని ఎస్ఐ రఫీ తెలిపారు.

చెట్టును ఢీకొన్న ట్రాక్టర్ : ఇరువురి మృతి



చెట్టును ఢీకొన్న ట్రాక్టర్



ప్రమాదంలో మృతి చెందిన గోల్కాసింగ్, మజీ సింగ్

చిన్నమండెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దమండెం ప్రధాన రహదారిలో తొగటపల్లి వద్ద ఒరిస్సాకు చెందిన విద్యుత్ వైర్లు లాగే కూలీల ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు... కరెంట్ స్తంభాలకు వైర్లు లాగేందుకు పులివెందులకు చెందిన మహేశ్ అనే కాంట్రాక్టర్ వద్ద ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుమారు 10 మంది పనిచేస్తున్నారు. శనివారం ఉదయం సంబేపల్లె నుంచి పదిమంది కార్మికులు ట్రాక్టర్‌లో వచ్చి చిన్నమండెం మండలంలోని పడమటికోన, కలిబండ గ్రామ సమీపంలో విద్యుత్ లైన్లు లాగారు. పని పూర్తయిన అనంతరం అందరూ ట్రాక్టర్‌లో సంబేపల్లెకు వెళుతుండగా తొగటపల్లె గ్రామ సమీపంలోని రాగానే ట్రాక్టర్‌కు బ్రేక్ పడకపోవడంతో సాయంత్రం 6.15 గంటలకు చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గోల్కాసింగ్ (23), మజీ సింగ్ (25) బలమైన రక్తగాయాలై మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మిగిలిన వారికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు.

అన్న క్యాంటీన్‌లో జేసీ భోజనం



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటిటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మాసాపేట మార్కెట్ యార్డులోని అన్న క్యాంటీన్‌ను శనివారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం చేయడానికి వచ్చిన వారిని భోజనం బాగుందా, సౌకర్యాలు ఎలా ఉన్నాయి, పరిశుభ్రత ఎలా ఉంది వంటి పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే భోజనం చేశారు.

మత సామరస్యానికి ప్రతీకగా

రాయచోటి నిలవాలి

శాంతి కమిటీ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి రాయచోటి ప్రతీకగా నిలవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి తెలిపారు. ఈ నెల 10న ఆదివారం బీజేపీ సారథ్యంలో నిర్వహించనున్న యాత్రను దృష్టిలో పెట్టుకొని శనివారం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులతో పాటు బీజేపీ నాయకులు, ముస్లిం మత పెద్దలతో చర్చించారు. యాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేయడమే కాకుండా, కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు నాటుతున్న జిల్లా అధికారి ప్రదీప్‌కుమార్

రైల్వేకోడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని భారత యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ (నెహ్రూ యువ కేంద్రం) అన్నమయ్య జిల్లా అధికారి బి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో మై భారత్ సహకారంతో గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుదేవ వశిష్ట కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రధాని అమ్మ పేరుతో ఒక చెట్టు అనే గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రజలు విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలు నాటడం ద్వారా తల్లిలాంటి ప్రకృతిని కాపాడుకున్నవారమవుతామన్నారు. ఇంటి ఆవరణలో పండ్ల మొక్కలు పెంచడం ద్వారా ఇంటి అవసరాల ఖర్చు తగ్గించుకోడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు. మహిళలు ఉపాధిగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథి మాట్లాడుతూ పర్యావరణ అసమతుల్యత కారణంగా సమయానికి వర్షాలు పడకపోగా, ఎండలు అధికమవుతున్నాయన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడమే కాకుండా ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించాలన్నారు. అనంతరం పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుదేవ వశిష్ట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్రజున్ను రమేష్, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు శివ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం తాళలేక ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహ్య చేసుకుంది. కోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు కోడూరు పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న యోగానంద సతీమణి ముక్కడి చిన్న రెడ్డమ్మ (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది.

దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె శనివారం ఉరి వేసుకుని మృతి ఆత్మహత్య చేసుకుంది. భర్త ఇచ్చిన సమాచారం మేరకు ఇంటికి వెళ్లి పరిశీలించి మృతదేహాని శవ పరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలి తల్లి చిన్నక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అన్నదాతకు 'ఆత్మా' చేయూత

● క్రియాశీలకంగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ● శాస్త్రీయ పద్ధతులకు రూ.59.5 లక్షలు



రైతుల్లో అవగాహన పెంచేందుకు బ్యాలెట్ బాక్స్ పరీక్షను నిర్వహిస్తున్న ఆత్మా బ్లాక్ టెక్నాలజీ మేనేజర్



వరిలో కాలిబాటలు తీసే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు సాగులో సాంకేతికతను చేరువ చేసే దిశగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. సాగు రంగానికి సమన్వయంగా రైతన్నలకు ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఆత్మాకు మోక్షం లభించింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని గాలికి వదిలేసింది. గడిచిన అయిదేళ్లల్లో ఒక్కపైసా నిధులు చేయకుండా నిర్వీర్యం చేసింది. ఆత్మాను బలోపేతం చేసి వ్యవసాయ రంగ శాస్త్రీయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ఆధునిక సాగు పద్ధతుల విస్తీరణకు కూటమి ప్రభుత్వం ఉమ్మడి కడప జిల్లాకు రూ.59.5 లక్షలు నిధులు మంజూరు చేసింది.

కడప జిల్లాలో 8, అన్నయ్య జిల్లాలో 4 వ్యవసాయ బ్లాక్‌లుగా కేటాయించారు. మంజూరైన నిధులతో ఆయా అధికారులు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధునాతన సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా పెట్టుబడులను తగ్గించడం, నూతన యత్ర పరికరాలు అయిన డ్రోన్ వంటి వాటి గురించి వివరిస్తారు. ప్రధాన పంటల గురించి క్షేత్రస్థాయిలో ప్రదర్శనలు, విజ్ఞాన యాత్రలు, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనకు మార్కెటింగ్, తెగుళ్లు, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యంపై సమగ్ర అవగాహన కల్పిస్తారు. ఈ పథకంలోని బ్లాక్ టెక్నాలజీ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రైతులను చైతన్యపరుస్తూ వారిలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నారు. సాగు విధానంలో నూతన ఒరవడిని, అధ్యయనాన్ని వివరిస్తూ అన్నదాతల చైతన్యం కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

రైతన్నకు సాంకేతిక పరిజ్ఞానం

వ్యవసాయ డివిజన్ల పరిధిలో సాగులో ఉన్న రైతులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. రైతుకు ఆధునిక పద్ధతులను వివరిస్తూ సాగు విధానంపై శిక్షణ కల్పిస్తాం. పొలంబడి, విజ్ఞానయాత్ర, కిసాన్‌మేళా తదితర కార్యక్రమాలతో పక్కా కార్యాచరణ ప్రణాళికతో ఆత్మాను ముందుకు నడిపిస్తాం.



- ఎస్.విజయలక్ష్మి, పీడీ, ఆత్మా

పాలకొండ్రాయ స్వామికి బంగారు నామాల బహూకరణ



బంగారు నామాలను అందజేస్తున్న సగబాల పార్వతమ్మ కుటుంబీకులు

కడప కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన సగబాల పాలకొండ్రాయుడు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పార్వతమ్మ కడప నగరానికి సమీపంలోని పాలకొండపై వెలసిన పాల కొండ్రాయ స్వామికి సుమారు మూడు తులాల బంగారు నామాలను బహూక రించారు. శ్రావణమాస మూడు శనివారం పాలకొండలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగబాల పాలకొండ్రాయుడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు స్వామివారికి సుమారు రూ.4లక్షల విలువైన బంగారు నామాలు, పట్టు వస్త్రాలు ఆలయ ఈవో శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు యోగి ద్వారా అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఈశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న బన్నూరు క్రిష్ణమూర్తి, ముచ్చర్ల శేషయ్య

బ్రహ్మంగారిమఠం ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీమాత ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు రూ.2లక్షలు విరాళంగా అందజేశారు. శనివారం స్థానిక కన్యకాపరమేశ్వరీ అమ్మవారిశాల అధ్యక్షుడు బన్నూరి క్రిష్ణమూరి కుటుంబసభ్యులు రూ.1,00,116లు, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు ఆర్యవైశ్య అన్నదాన సత్రం, అమ్మవారిశాల కమిటీ మెంబర్ ముచ్చర్ల శేషయ్య కుటుంబసభ్యులు రూ.1,00,116లు మఠాధిపతులు వీరశివకుమార్ స్వామికి అందజేశారు. దాతలను శివకుమార్‌స్వామి శాలువ, పూలమాలతో సన్మానించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జునగౌడ్

కడప మారుతీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రీషియన్‌లో గల హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని హరితహోటల్ జిల్లా డీవీఎం మల్లికార్జునగౌడ్ కోరారు. శనివారం స్థానిక హరితహోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల అధ్యాపకులు ఎస్.శివరామకృష్ణ చౌదరితో కలిసి ఆయన మాట్లాడారు. ఇందులో మూడు సంవత్సరాల బీఎస్సీ (హెచ్‌ఎండ్ హెచ్‌ఏ) డిగ్రీ కోర్సులో ఇంటర్‌లో 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇదిలా వుండగా క్రాఫ్ట్ కోర్స్ ఇన్‌ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్సు, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్‌కు పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. ఈ కోర్సులలో 5 నెలలపాటు వివిధ రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి.. ఒక నెల ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారన్నారు. కోర్సుల కాలం పూర్తికాగానే ఏపీ రాష్ట్ర పర్యాటకశాఖ హోటల్స్, ప్రముఖ ఫైవ్‌స్టార్ హోట ళ్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. అర్హులైన యువతీ, యువకులకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం కలదన్నారు. మరింత సమాచారం కోసం 9701343846, 9100558006, 9502113163 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. పూరించిన దరఖాస్తులను ఈనెల 13వ తేదీ లోపు తిరుపతిలో గల కళాశాలకు పంపించాలని కోరారు.

ఉప ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పులివెందులలో 500 మందిపై బైండోవర్ ● ఎస్పీ అశోక్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

పులివెందుల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్పీ వచ్చారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీకి ఉప ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా పులివెందుల మండలంలో 9 చోట్ల ఓటింగ్ సాగుతుందన్నారు. ఇక్కడ అవసరమైన అన్ని ఏర్పాట్లను పరిశీలించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా దాదాపు 500మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. రౌడీషీటర్లపై, ఓటర్లను కావాలనే ఇబ్బంది పెట్టాలనుకునే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం 48 గంటల ముందు ప్రచారాలు ముగించాలన్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు హోటళ్లు, లాడ్జిలలో ఉండేవారిపై వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. వెహికల్స్‌లో తిరిగే వారిపై కూడా వివరాలు సేకరిస్తున్నామన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత ఎన్నికలు జరగడమే ఏకైక లక్ష్యంగా ఏర్పాట్లు సాగించామన్నారు. పులివెందుల మండలంలో తొమ్మిది ప్రాంతాలలో ఓటింగ్ సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలతో భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటింగ్ జరుగుతున్న సమయంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో చిత్రీకరణ, కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటు కూడా జరుగుతుందన్నారు.

గండి క్షేత్రానికి వెళ్తుండగా.. ఆటోను ఢీకొట్టిన కారు

ఒకరు మృతి... కుటుంబ సభ్యులకు గాయాలు



మృతి చెందిన పుల్లయ్య, నుజ్జునుజ్జు అయిన ఆటో

వేంపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం చేసుకునేందుకు ఓ కుటుంబం గండి క్షేత్రానికి ఆటోలో వెళుతుండగా ప్రమాదం సంభవించి ఒకరు మృతి చెందగా.. మరి కొందరికి గాయాల య్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వెలమవారిపల్లె గ్రామానికి చెందిన గండ్లూరు పుల్లయ్య (55), కుమారుడు వలి, కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం ఆటోలో గండికి బయలుదేరారు. మార్గమధ్యలోని నందిపల్లె సమీపంలో పులివెందుల-వేంపల్లె ప్రధాన రహదారిలో వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఆటోను వేగంగా ఢీకొంది. దీంతో ఆటో చెట్టుకు ఢీకొని నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో పుల్లయ్య తీవ్రంగా గాయపడగా అసుపత్రికి తీసుకెళుతుండగా మృతి చెందాడు. కుమారుడు వల్లి, మనువడు, మనువరాలు నయాన్, మెహరీన్‌లకు గాయాలయ్యాయి. వీరిని వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి.. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. పుల్లయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలో ఉంచారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'గిరిజనులపై దాడికి తెగబడిన అగ్రకులాల వారిని అరెస్ట్ చేయాలి'

కడప మారుతీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బాకీ వున్నారనే నెపంతో వేంపల్లి టౌన్ రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గిరిజన (ఎరుకల) కులానికి చెందిన ఎన్. వెంకటలక్ష్మమ్మతో పాటు ఈమె తల్లి రామలక్షుమ్మలను కారులో బలవంతంగా తీసుకెళ్ళి దాడికి పాల్పడిన వారిని తక్షణం పోలీసులు అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెనుగొండ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం ఎర్రముక్కపల్లెలో గల ఏఐఎహెచ్‌పీఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామలక్షుమ్మ పెద్ద కుమార్తె గంగాదేవికి రూ.40 లక్షలు అప్పుగా ఇస్తే.. చెల్లించకుండా కాలయాపన చేస్తున్నదంటూ సదరు ప్రాంతానికే చెందిన వరప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, నాగార్జున, వీరి అనుచరులు మహిళలను వారి ఇంటి నుంచి కారులో తీసుకెళ్లి వివిధ ప్రాంతాలలో పది రోజులపాటు చిత్రహింసలకు గురిచేయడం దారుణమన్నారు. కాగా ఆ మహిళలు నివాసం వున్న ఇంటి పేపర్లు, వ్యక్తిగత బాండ్లు, తీసుకు వచ్చి తిరిగి ప్రామిసరీ నోట్లపై కుటుంబసభ్యులతో సంతకాలు తీసుకురావాలంటూ హుకుం జారీ చేశారన్నారు. ఈ విషయాన్ని బట్టబయలు చేస్తే చంపేస్తామని బెదిరించడం బాధాకరమన్నారు.

ఈ విషయంపై జిల్లా ఎస్పీకి గత మే నెల 26న ఫిర్యాదు చేశామన్నారు. అంతేకాకుండా రాష్ట్ర హోంమంత్రికి, ట్రైబల్ మంత్రికి రాతపూర్వకంగా ఇచ్చినట్లు స్పష్టం చేశారు. వీరితో పాటుగా వేంపల్లి పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు కాపీని ఇచ్చామన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా వారిపై కేసు నమోదు చేశారే కానీ ఇప్పటి వరకు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

మలేరియా రహిత జిల్లాగా చేద్దాం



సుగాలి బిడికీలో దోమల నివారణ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, వైద్య సిబ్బంది

రామాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాను 2027 నాటికి మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ సచివాలయ పరిధిలో శనివారం దోమల నివారణ (ఏసీయం) స్ప్రేయింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటిలో దోమల నివారణ మందు తప్పనిసరిగా స్ప్రే చేయించు కోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించి దోమల వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో సాయంత్రం వేళల్లో వేపాకు పొగ పెట్టడం వల్ల దోమలను నివారించుకోవచ్చని తెలిపారు. స్ప్రే నిర్వహణపై స్టేట్ కన్సల్టెంట్ కొండారెడ్డి విజయవాడ నుంచి వీడియో కాల్ ద్వారా పర్యవేక్షించి సాంకేతిక సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, హెల్త్ అసిస్టెంట్ క్రిస్టఫర్, ఆశ కార్యకర్తలు, స్ప్రే కాంట్రాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన డీఐవో



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఐవో ఉమామహేశ్వరరావు

కడప కలెక్టరేట్/ బద్వేలు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రవేట్ ఆసుపత్రులను సోమవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ అకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రులలో ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్, పొల్యూషన్, ధరల పట్టికల ప్రదర్శన, నీటి వసతి, పరిసరాల పరిశుభ్రత, రికార్డులు పరిశీలించారు. ముఖ్యంగా అర్హత గల వైద్య సిబ్బంది ఉన్నారా? లేదా? అనే విషయాలను ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఐవో హెచ్చరించారు.

బద్వేలులో...: పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను శనివారం ఆర్‌బీఎస్‌కే జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రమేష్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు, చెక్‌లిస్ట్‌లో పేర్కొన్న ప్రమాణాల అమలు పరిస్థితిని, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, సూపర్‌వైజర్ మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న వైద్యశాఖ అధికారులు

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ.. తప్పిన ప్రమాదం



కొండాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పట్టణంలో శనివారం ఓ లారీ డివైడర్‌పైకి దూసుకొచ్చింది. లోడుతో తాడిపత్రి వైపునకు వెళుతున్న లారీ ఒక్కసారిగా డివైడర్‌పై దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వాహనాల రాకపోక లు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డివైడర్‌పై ఉన్న బారికేడ్లు, లారీ ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది.

ఒకే చోట సీహెచ్‌సీ, పీహెచ్‌సీ

● పల్లెలకు అందని వైద్యసేవలు ● ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలు

చెన్నూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతప్రజలకు వైద్యసేవలు అందని ద్రాక్షలా మారాయి. మండల కేంద్రంలో ఒకేచోట సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో దూర ప్రాంత ప్రజలు వైద్య కోసం రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలైన కైలాసగిరికోన, ఎస్టీ రామాపురం కాలనీ, దౌలతాపురం ఎస్టీ కాలనీ, గుర్రంపాడు ప్రాంత ప్రజలు వైద్యసేవలు పొందాలంటే ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూరులో దాదాపు 60 ఏళ్ల క్రితం ప్రాథమిక వైద్యశాలను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో మండల జనాభా పెరగడంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చారు. అయితే ప్రతి మండల కేంద్రానికి సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తప్పకుండా నిర్మించాలి. అయితే చెన్నూరులోని విలేజ్ క్లినిక్‌నే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చారు. అంతకు ముందు సామాజిక ఆరోగ్య కేంద్ర భవనంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ఉండేది. వైద్యం కోసం వచ్చిన ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లకుండా సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లడంతో అక్కడ ఓపీ విభాగంలో వత్తిడి ఎక్కువ అయ్యింది. ఎట్టకేలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఈ విషయం వైద్యవిధానపరిషత్‌కు తెలి పి సీహెచ్‌సీ భవన నుంచి పీహెచ్‌సీ భవనాన్ని వేరు చేస్తూ విలేజ్ క్లినిక్‌లో పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. అయితే రెండు కూడా మండల కేంద్రంలోనే కొనసాగుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాలకు అందని వైద్యసేవలు

మండల కేంద్రంలోనే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఉండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కైలాసగిరి కోన, ఎస్టీరామాపురం కాలనీల ప్రజలు రాత్రివేళ, అత్యవసర పరిస్థితులో దాదాపు ఆరేడు కి.మీ దూరం నుంచి మండల కేంద్రా నికి రావాలంటే.. వారి అవస్థలు వర్ణనాతీతం. వైద్యశాఖ అధికా రులు ఈ విషయం పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోవడంతో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామని చెప్పిన పప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో సీహెచ్‌సీ, పక్క గ్రామాల్లో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



చెన్నూరులోని సీహెచ్‌సీ భవనం, పీహెచ్‌సీ భవనం



జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో భాగంగా శనివారం పులివెందుల మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామంలో టీడీపీ అభ్యర్థి లతారెడ్డికి మద్దతుగా ర్యాలీలో పాల్గొని ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బద్వేలు ఇన్‌చార్జి రితేశ్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి.

విజన్ లేని వైసీపీ ఐదేళ్ల పాలన చూశాం

ఎన్నికల హామీ నెరవేరిస్తే సరి అన్నట్లు జగన్ తీరు : మంత్రి పార్థసారథి

పులివెందుల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం విజన్ లేని పాలన సాగించిందని మంత్రి పార్థసారథి న్నారు. శనివారం ఉప ఎన్నికల్లో భాగంగా ప్రచారానికి వచ్చిన ఆయన పులివెందులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలో వైసీపీ చేసిన పాలన ఎలాంటి విజన్ లేకుండా, ఎలాంటి ముందు చూపు లేకుండా సాగిన పాలన చూశామన్నారు. కేవలం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలుతోనే తన పని అని జగన్ పాలన సాగించారన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన తద్వారా విద్యార్థులకు భరోసాకల్పించి ఉండొచ్చు గాని, చదువులుపూర్తైన వారికి ఉపాధి కల్పించడంలో భరోసా కల్పించ లేకపోయారన్నారు. రాష్ట్రంలో నూతనంగా సంస్థలు ఏర్పాటుచేయించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ధ్యాస లేకపోయిందన్నారు. కేవలం చదువుకుంటేనే చాలుఅనే విధంగా సాగితే ఎలా రాష్ట్రం అభివృద్ధి చెందు తుందన్నారు. రాష్ట్రంలో ఉపాధి కల్పన అనే ఆలోచనే లేకుండా సాగిందన్నారు. జగన్ రాయలసీమ ప్రాంతవాసి అయినప్పటికీ ప్రాజెక్టులు పూర్తిచేయాలనే ధ్యాస లేకపోయిందన్నారు. అన్నదాత సుఖీభవ అందించడంతోనే తమ పనిపూర్తైందని అనుకుంటే వ్యవసాయం ఏవిధంగా ముందుకుపోతుందని ఆయన ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ వేడినీళ్లకు చల్లనీళ్ల అనేలా ఉపయోగపడుతుందని, వ్యవసాయాన్ని పూర్తిగా ఆదుకోలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలు లేదా 48 గంటల్లో రైతులకు డబ్బులు జమచేసిన ప్రభుత్వం ఒక కూటమి ప్రభుత్వమే అన్నారు. పులివెందుల ప్రాంతంలో అరటి రైతుల కోసం కోల్డ్‌స్టోరేజ్ ప్రారంభిస్తేనే పని పూర్తి కాదన్నారు. దాని నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు కూడా తీసుకోవాలన్నారు.

గృహనిర్మాణ విషయంలో అప్పటి ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆమోదానికి ప్రత్యేక చొరవ చూపారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలెంపల్లె చంద్రశేఖర్‌రెడ్డి గోడౌన్ వద్ద అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 35 బస్తాల రేషన్ బియ్యాన్ని శనివారం సీఐ క్రిష్ణారెడ్డి తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. ఈ మేరకు చంద్రశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి

కడప సెవెన్ రోడ్స్ ఆస్టు 9 (ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయు) జిల్లా విస్తృత సమావేశం సీఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన యూటీఎఫ్ ఆఫీస్‌లో జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ సీఐటీయు అఖిలభారత మహాసభలు విశాఖలో జరగడం అభినందించదగ్గ విషయమన్నారు. డిసెంబరు 31, 2025, జనవరి 4వ తేదీ వరకు ఐదు రోజుల పాటు మహాసభలు జరుగుతున్నాయన్నారు. చివరి రోజు పెద్దఎత్తున బహిరంగ సభ జరుగుతుందన్నారు. అన్ని రంగాల, మండల నాయకత్వం ప్రతి కార్యకర్తలు, సభ్యుడు జయప్రదానికి కృషిచేయాలని తెలిపారు.

ఆంజనేయస్వామికి పూజలు



సీకేదిన్నె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా ఆంజనేయస్వామికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మూలవంక వద్ద ఉన్న అభయహస్త ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కనువిందు చేసేందుకు కోలాట బృందంచే కోలాటం ఏర్పాటు చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

పులివెందులకు సాగు, తాగునీరు ఇవ్వలేని ..

దుస్థితిలో జగన్ ప్రభుత్వం

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



మాట్లాడుతున్న ఎంపీ శబరి

పులివెందుల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంతరైతులకు సాగు, తాగునీరు ఇవ్వలేని దుస్థితిలో జగన్ ప్రభుత్వం పాలన సాగించిందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. శనివారం ఆర్.తుమ్మలపల్లె గ్రామంలో బైరెడ్డి శబరి జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లపాటు జగన్ ముఖ్యమంత్రిగా ఉండి ఈ ప్రాంతానికి ఏంచేశారని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గానికే ఏంచేయలేని నాయకులు రాష్ట్రానికి ఏమీ చేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, లింగాల మండల ఇన్‌చార్జి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

137 జీవోను రద్దు చేయకపోతే ఆందోళన

ఆర్టీసీ ఈయూ నాయకులు

కడప మారుతీనగర్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఏపీఎస్ ఆర్టీసీ గవర్నర్‌పేట 1, అండ్ 2 డిపోలకు చెందిన నాటి పాతబస్టాండ్‌కు సంబంధించి సుమారు 400 కోట్ల రూపాయల విలువ చేసే 4.15 ఎకరాల స్థలాన్ని లులు షాపింగ్‌మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టడం సరైందికాదని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అన్నారు. శనివారం స్థానిక యూనియన్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆ రెండు డిపోలకు చెందిన 200 బస్సులతో పాటుగా దాదాపు 1,100 మంది ఆర్టీసీ ఉద్యోగులతో ప్రజలకు రవాణా సౌకర్యాలు అందిస్తున్న ఆర్టీసీని ప్రజలకు, ప్రయాణీకులకు దూరం చేస్తూ బడా పారిశ్రామిక వేత్తకు జీఓ నెంబర్ 137 ద్వారా కట్టబెట్టడం దారుణమన్నారు. తక్షణమే 137 జీవోను ప్రభుత్వం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఈ.యూ నాయకులు నాగసుబ్బారెడ్డి, ఏఆర్ మూర్తి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్ మూర్తి

అనధికారిక లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

సీకేదిన్నె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనధికారిక లేఅవుట్లు, ప్లాట్లు, క్రమబద్ధీకరణకు గడువును పొడిగించినట్లు ఈవోపీఆర్ డీ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ పొడిగించిందని ప్లాట్ల యజమానులు 30.6.2008లోపు రిజిస్టర్ అయినవారు ఇందుకు అర్హులని, అదేవిధంగా ప్లాట్ అమ్మకం కూడా ఆతేదీలోపు రిజిస్టర్ అయి ఉండాలని, 26.7.2025 నుంచి 9 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అటువంటి వారికి ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. క్రమబద్ధీకరణ వలన చట్టబద్ధ బహుళ అనుమతులు, ప్రాథమిక వసతులు, భవిష్యత్తులో న్యాయబద్ధమైన లావాదేవీలు , చట్టబద్ధమైన భద్రత లభిస్తాయన్నారు. ప్రజలు కూడా కడప పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో వేసిన లేఅవుట్లు, అనధికార ప్లాట్ల యజమానులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని చట్టబద్ధంగా క్రమబద్ధీకరించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు గ్రామ పంచాయతీ కార్పొరేషన్‌ను సంప్రదించాలని కోరారు.

అమెరికా దురాగతానికి సాక్ష్యాలు హిరోషిమా, నాగసాకి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అమెరికా దురాగతానికి సాక్ష్యాలు హిరోషిమా, నాగసాకి పట్టణాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.విశ్వనాథ్ తెలిపారు. అమెరికా ఆగస్టు 6న హిరోషిమా, 9న నాగసాకి పట్టణం మీద అణుబాంబులు ప్రయోగించిందని తెలిపారు. శుక్రవారం కడప ఎస్‌టియు భవన్‌లో జెవివి ముఖ్య నేతల సమావేశం జరిగింది. రాష్ట్ర సలహా మండలి సభ్యులు కె.సురేష్‌బాబు మాట్లాడారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి సనావుల్లా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేవీవీ, ఎస్టీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత నివారించాలి



ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న దస్తగిరిరెడ్డి

కడపసెవెన్ రోడ్స్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న యూరియా కొరతను తక్షణం తీర్చకపోతే ఆందోళన తప్పదని ఏపీరైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. శనివారం యూరియా కొరతపై కడపలో ఎరువుల దుకాణాలను పరిశీలించారు. దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో 77,475 హెక్టార్లు పంటల సాధారణ సాగు విస్తీర్ణంగా అంచనా అన్నారు. 20500 ఎంటీల యూరియా అవసరం కాగా 12వేల ఎంటీలు కేటాయించి చివరకు 4062ఎంటీలు ఇచ్చిందన్నారు. కేసీ కెనాల్ ఆయకట్టుకు నీళ్ల రావడంతో యూరియాకు డిమాండ్ వచ్చింద న్నారు. గ్రామాలలో రాజకీయ పలుకుబడి ఉన్న వారికే యూరియా దక్కుతోందన్నారు. యూరియా కొరత లేదని అగ్రికల్చర్ జేడీ చంద్రా నాయక్ చెప్పడం అవాస్తవమన్నారు. వెంటనే రైతులకు సరిపడా యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని గురుకులాల పాఠశాల క్వార్టర్స్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో క్వార్టర్స్ 40ఏళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోలేదని ఎస్టీయూ ప్రతినిధి లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ గురుకుల పాఠశాలల టీచర్స్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో క్వార్టర్స్ ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదని గతంలో లాగా నిర్ణీత హెచ్ఆర్ వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, సురేష్‌బాబు, ఇలియాస్ బాష తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ వర్గీయుల హక్కులకోసం అలుపెరుగనిపోరు

కడప మారుతీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ వర్గీయుల న్యాయమైన హక్కుల సాధనకు అలుపెరుగని పోరు సాగించనున్నామని అఖిల భారతీయ కోలీ సమాజ్ (ఆర్ఈజీడీ) ముదిరాజ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ దుడం రెడ్డిబాబు స్పష్టం చేశారు. శనివారం స్థానిక బిల్టప్ సమీప జిల్లా ముదిరాజ్ సంక్షేమసంఘం కార్యాలయంలో నూతనంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక..: జిల్లా అధ్యక్షుడుగా ఎ. శివశంకర్, ఉపాధ్యక్షులుగా మణికుమార్, వివేకానంద్, ప్రధానకార్యదర్శిగా బి. సునీల్, కార్యదర్శిగా నరసింహులు, ట్రెజరర్‌గా శీను గంగాధర్, కార్యవర్గసభ్యులుగా వెంగయ్య తదితరులు ఎన్నికయ్యారు.

అరాచకాలు సృష్టించేందుకు సాక్షి వాహనాల మోహరింపు

వారిపైన వారే దాడులు చేసుకొని మాపై నెపం మోపితే చూస్తూ ఊరుకోం : బీటెక్ రవి



పులివెందుల రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న సాక్షి వాహనాలన్నింటినీ పులివెందుల మండలంలోని గ్రామాలలో తిప్పుతున్నారని, వారంతట వారే దాడి చేసుకొని తమపై నెపంమోపితే చూస్తూ ఊరుకోబోమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్ర నాథరెడ్డి (బీటెక్‌రవి) పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికల్లో వైసీపీకి చెందిన నలుగురు ముఖ్యమైన నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారన్నారు. జగన్ మెప్పుకోసం అవినాశ్‌రెడ్డి ఉప ఎన్నికలపై కుట్రలు చేస్తున్నారన్నారు. కుట్రలు చేసి నిందలు తమపై వేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఎన్నికల రోజు గాని, ముందురోజు గాని సాక్షి వాహనాలకు సంబంధించి వారంతట వారే ఏవైనా గొడవలు సృష్టించుకొని వారి ఆసుపత్రికే వెళ్లి చేతులకు, కాళ్లకు కట్టు కట్టుకొని జర్నలిస్టులపై దాడి చేశారని ప్రకటనలు చేస్తే మాత్రం సహించేది లేదన్నారు. పోలీసులకు, ఎన్నికల కమిషన్‌కు ముందుగానే ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. బయట మండలాలకు సంబంధించిన వ్యక్తులు, పులివెందుల మండలంలో సృష్టించిన గొడవలే మొన్న జరిగిన రెండు గొడవలూ అన్నారు. పులివెందుల మండలంలో ఏ నాయకుడు, ఏ ఓటర్ గాని ఇబ్బందిపడలేదు, గొడవలు సృష్టించలేదన్నారు. ఎన్నికల రోజు ఎలాగైనా అల్లర్లు సృష్టించాలని వైసీపీ వారి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పోలీసు యంత్రాంగం, ఎన్నికల కమిషన్ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

నగరంలో జోరు వాన

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. నగరంలో పలుప్రాంతాలు జలమయమయ్యాయి. రాత్రి ఏడు గంటల నుంచి 9.30వరకు భారీగా వర్షం కురిసింది. నగరంలో చాలా ప్రధానంగా చిన్నచౌక్, కొత్త బస్టాండ్, వైజంక్షన్, హోమియోపతి కాలేజీ రోడ్డుతో పాటు అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు పాదచారులు ఇబ్బందులు పడ్డారు. చాలా రోజుల తర్వాత వర్షం కురవడంతో నగరంలో కొంత చల్లని వాతావరణం ఏర్పడింది.



పారిశుధ్యంపై సత్వర చర్యలు



వేంపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో పారిశుధ్యంపై సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు వీరపునాయునిపల్లె పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో వేంపల్లెలో పారిశుధ్యం పడకేసింది. ఈ సమస్య జిల్లా అధికారుల దృష్టికి వెళ్లడంతో ఈఓ లేక పారిశుధ్య సిబ్బందికి వేతనాలు సకాలంలో అందక పారిశుధ్య పనులు కుంటుపడ్డాయి. డీపీఓ రాజ్యలక్ష్మి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని జూనియర్ అసిస్టెంట శ్రీనివాసులు, వీఎన్‌పల్లె కార్యదర్శికి సూచించడంతో రెండు రోజుల నుంచి ముమ్మరం చేశారు. ఎక్కడ పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా వెంటనే సమాచారం ఇవ్వాలని, చర్యలు తీసుకుంటామని నాగభూషణంరెడ్డి తెలిపారు.

'ప్రజలను నిలువునా

దోపిడీ చేస్తున్న మాల్స్'

కడప నాగరాజుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపెద్ద మాల్స్ కోట్ల రూపాయలు ప్రకటనలు చేసి స్థానిక వ్యాపారులను దివాలా తీసేలా చేస్తూ, ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నాయని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బండిజకరయ్య, ఉపాధ్యక్షుడు ముత్యాల జార్జి పేర్కొన్నారు. స్థానిక కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మాల్స్ వల్ల చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, గుజరాత్, సూరత్ ప్రాంతాల నుంచి టైం అయిపోయిన వస్తువులు తక్కువ ధరకు దిగుమతి చేసుకొని ప్రజలకు టోపీపెడుతున్నారన్నారు.



గిరిజన సంక్షేమానికి చేయూతనివ్వాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమానికి ప్రభుత్వాలు చేయూత నివ్వాలని రాష్ట్ర గిరిజన అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కేద్రీ శ్రావణ్‌కుమార్ కోరారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక తారకరామనగర్‌లో సంబరాలు జరుపుకున్నారు. తొలుత కేక్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సుధాకర్, మల్లికార్జున, జయమ్మ, నాగలక్ష్మీ, మల్లీశ్వరి నాగమ్మ తదితులు పాల్గొన్నారు.

సర్వే ద్వారా బంగారు కుటుంబాలను ఎంపిక చేయాలి

కమలాపురంరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల ఎంపిక పీ-4 సర్వే ద్వారా త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ గండి భారతి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో మండల స్థాయిసర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కెజియా అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతిగురించి వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు,కార్యదర్శులు పాల్గొన్నారు.

సోదర, సోదరీ బంధానికి ప్రతీక రక్షాబంధన్

కడప కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నా, చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ పర్వదినం నిలుస్తుందని రాజయోగిని బ్రహ్మకుమారి గీతాదీదీ అన్నారు. రక్షా బంధన్ పర్వదినం సందర్భంగా ఓం శాంతినగర్ బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిసి రాఖీ కట్టి పండుగ విశేషతను వివరించారు. అనంతరం ఈశ్వరీయ కానుకను అందజేశారు. కార్యక్రమంలో సుశీల అక్కయ్య, ఈశ్వరీ అక్కయ్య, ప్రదీప అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల టూల్ డౌన్

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులుసమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేసి 12వ పీఆర్సీ ప్రకటించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద టూల్ డౌన్ సమ్మె నిర్వహించారు. బాదుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ జీఓ నెంబర్ 36ను అమలు చేయకుండా కొత్త జీఓ 124 ప్రకారం మూడు కేటగిరీల ఇంజనీరింగ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కేవలం మూడు వేలు మాత్రమే పెంచిందన్నారు. సంవత్సరాలు తరబడి వెట్టి చాకిరీ చేయించుకొని పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా 62 సంవత్సరాల రిటైర్‌మెంట్ కొనసాగించకుండా 60 ఏళ్లు నిండాయనే నెపంతో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా కార్మికులను నిలిపివేయడం చట్టవ్యతిరేకమన్నారు. సంక్షేమ పథకాలు కార్మికులందరికి వర్తింపజేయాలని కార్మికులకు గ్రాట్యుటీ పింఛన్ వారసులకు ఉద్యోగాలను కల్పించాలని డిమాండ్ చేశారు.



టూల్‌డౌన్ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

దొంగతనాలు జరుగకుండా ప్రత్యేక నిఘా



రమణారెడ్డి
సర్కిల్ఇన్‌స్పెక్టర్, మైదుకూరు

మైదుకూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మైదుకూరులో దొంగతనాలు జరుగకుండా ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటుచేసి నిఘాను ముమ్మరం చేశామని మైదుకూరు సీఐ రమణారెడ్డి పేర్కొన్నారు. శాంతిభద్రతలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: చోరీల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు ?

జవాబు: మైదుకూరులో ప్రత్యేకంగా కొంత మంది పోలీసులను ఏర్పాటు చేశాం. పట్టణంలో పలు చోట్ల సీసీ కెమెరా నిఘాను కూడా ముమ్మరం చేశాం.

ప్రశ్న: మట్కా, జూదం, పేకాటలపై ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు ?

జవాబు: మట్కా, జూదం, పేకాట కేసులు మా పరిధిలో చాలా తక్కువ. వాటిపై ప్రత్యేక టీమ్ అబ్జర్వేషన్‌లో ఎప్పుడు ఉంటారు.

ప్రశ్న: ఈవిటీజింగ్ లాంటివి ఏమైనా ఉన్నాయా ?

జవాబు: మా పరిధిలో కొంత సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎక్కడ కళాశాల విద్యార్థులు తిరుగుతున్నారో, అక్కడ మా పోలీసులు డ్యూటీలు చేస్తున్నారు.

ప్రశ్న: ట్రాఫిక్ సమస్యను ఎలా పరిష్కరిస్తున్నారు ?

జవాబు: మైదుకూరు పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఉదయం, సాయంత్రం మాత్రమే కొంతఉంటుంది. మా పోలీసులు ఇద్దరు, లేదా ముగ్గురు ట్రాఫిక్ డ్యూటీలు చేస్తు న్నారు.

ప్రశ్న: విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాల గురించి అవగాహన కల్పిస్తున్నారా ?

జవాబు: అన్ని కళాశాలలకు వెళ్లి ఆన్‌లైన్ మోసాల గురించి ఎప్పటి కప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. అంతే కాకుండా పిల్లల పట్ల తల్లిదం డ్రులు కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రశ్న: సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా?

జవాబు: వ్యాపారస్తులు,ఇంటి యజమానులు సీసీ కెమోరాలు బిగించుకో వాలి .దాతలు సహకరిస్తే ఎక్కడైన కొన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలు బిగిస్తాం.

దుర్వాసన భరించలేకున్నాం

ఎర్రగుంట్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయకనగర్‌లోగల చేపల బజార్‌లో ఇళ్ల మధ్యనే మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే వారు లేరు. ఆ వీధి మధ్యలో కెళితే చాలు భరించరాని కంపు. కడుపులో దేవేస్తోందని స్థానికులు వాపోతున్నారు. చుట్టూ ఇళ్ల మధ్యలో మురుగు కూపంలో నీటినిలిచి ఆ ప్రదేశమంతా భరించరాని కంపుకొడుతోంది. వర్షపు నీటికి తోడు కొందరు ఇళ్లలోని చెత్తా చెదారంతో పాటు మురుగునీటిని కూడా అక్కడే వేస్తుండటంతో ఆప్రదేశంలో ఉండాలంటనే జనం హడలిపోతున్నారు. సొంతిళ్లు ఉన్నవారు ఎక్కడికి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా సమస్య ఉందని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదంటున్నారు.



కుంట కాదు మురుగునీరు నిలిచిన ఖాళీ స్థలం

ఎన్నికల్లో వచ్చి హామీ ఇస్తారు.. వెళతారు

ఎన్నికల్లో ఓట్లకోసం వస్తారు. మా సమస్యలు పరిష్కరించేందుకు మాత్రం ముందుకు రావడంలేదని కాలనీలో నివాసం ఉంటున్న మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. నాయకుల వద్దకు వెళ్లాలంటే కొందరు మధ్యలోనే అడ్డుకుంటున్నారని అందుకే సమస్య తీరడంలేదని వాపోతున్నారు. ఖాళీ స్థలంలో మురుగునీరు నిల్వ లేకుండా చూస్తే తప్ప ఇక్కడి సమస్య పరి ష్కారం కాదు. వాటిపై మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు.

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద టూల్‌డౌన్ సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు పట్టణాధ్యక్షుడు బి.రామయ్యలు పేర్కొన్నారు. శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు టూల్‌డౌన్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరితే మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఉగాదికి చెల్లిస్తామనడం దారుణమన్నారు. అంతవరకు కార్మికులు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, పారిశుధ్య కార్యాలయ సిబ్బంది, పాఠశాలలోని స్వీపర్లకు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పి ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల కొరత ఉందని మరణించిన, రిటైర్డు అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మధు, వెంకటనరసింహ, శ్యాం, పీరమ్మ, రాజేష్, గురుమూర్తి, ప్రమీళారాణి, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హామీలను నెరవేర్చండి



మాట్లాడుతున్న మున్సిపల్ కార్మికులు

బద్వేలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ బద్వేలు పట్టణ కార్యదర్శి నాగేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్, ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ జీవో 124 ఇవ్వడంపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అలాగే చనిపోయిన కార్మికుల కుటుంబాల వారికి ఉద్యోగాలు ఇవ్వాలని , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దేవా, హరి, వెంకటరెడ్డి, వెంకటేష్, రమణ, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవ వేడుకలు

● భక్తులకు అమ్మవారి చీరెలు, తాంబూలం పంపిణీ



విశేష అలంకరణలో సంతోషిమాత

ఎర్రగుంట్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి పెన్నాతీరంలో వెలసిన సంతోషిమాత ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. 'శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు, పుష్పాలంకరణ, మహామంగళహారతులు ఇచ్చారు. ముత్తైదువులకు అమ్మవారి శేష వస్త్రములు, సౌభాగ్యదాయకములైన పంచ మహా శేష్టములైన తాంబూలం పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు, ప్రసాద్‌శర్మ దంపతులు పంపిణీ చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీచేశారు. విశేష సంఖ్యలో వచ్చిన మహిళా భక్తులు అమ్మవారికి కాయకర్పూలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

పిల్లల ఆరోగ్యానికి నులిపురుగు మందు

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సంపూర్ణ ఆరోగ్యానికి నులిపురుగు నివారణకోసం ఆల్‌బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వాడాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ హనీఫ్‌బాబా, ఎంఈవో సావిత్రమ్మ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి, ఎంపీడీవో బాలన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని కళాశాలలు, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీకేంద్రాల్లో, 1 నుంచి 19 సంవత్సరాల మధ్యగల పిల్లలందరికి ఉచితంగా నులిపురుగు నివారణ మందులు వేయించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, చంద్రకళ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ పౌర్ణమి పూజలు



పుష్పాలంకరణలో రతనాల వెంకటేశ్వరస్వామి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామివారికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. సాయంత్రం 108 మంది సుహాసినులు లలితాదేవి అమ్మవారికి జాజిపూలతో సహస్రనామార్చన, వేంకటేశ్వరస్వామికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అలాగే మండల పరిధిలో లక్ష్మీనరసింహాపురంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కొత్త పేటకు చెందిన మహిళలు ఊరేగింపుగా చీరె, సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించివిశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదం వినియోగం చేశారు. వైఎంఆర్ కాలనీలోని దత్తపీఠంలో పౌర్ణమిని పురష్కరించుకుని దంపతులు సామూహిక సత్యానారాయణస్వామి వ్రతం ఆచరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు



బద్వేలు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెలవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడవ శనివారం పౌర్ణమిని పురష్కరించుకొని స్వామి అమ్మవార్లకు అభిషేకంతోపాటు విశేష పూజలు నిర్వహించారు. పంచలోహతొడుగులతో, పూలమాలలతో స్వామి అమ్మవార్లకుచేసిన ప్రత్యేక అలంకరణను చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అల్ల పెద్ద వెంకటయ్య కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కైంకర్యం చేశారు.

భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

మైదుకూరు రూరల్, ఆగస్ట 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మీ మాధవరాయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం భక్తులు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకొన్నారు. శ్రావణ పౌర్ణమి కావడంతో లక్ష్మీ మాదవరాయస్వామి ఆలయంలో సుమారు ముప్పై మంది జంటలు సత్యనారాయణ స్వామి వ్రతం పాల్గొని వ్రతం ఆచరించారు. కార్యక్రమంలో మాదవాచార్యులు, ఆలయ నిర్వహకులు బండి సుబ్బరాయుడు తదితరులు రు.

దళితులపై దాడులను సహించేది లేదు



మాట్లాడుతున్న జేఏసీ దళిత నాయకులు

పోరుమామిళ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులను సహించేది లేదని రాష్ట్రప్రభుత్వం వెంటనే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని దళిత గిరిజన జేఏసీ బద్వేల్ డివిజన్ చైర్మన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ముత్యాల ప్రసాదరావు, దళిత నాయకులు డిమాండ్ చేశారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో మాట్లాడుతూ తిరుపతిలో దళిత యువకుడిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిచర్యలు తీసు కోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన దళితులపై దాడులు అరాచకాలు అధిక మయ్యాయన్నరు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి ఇలాంటివి జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బండి ఓబులేసు, బాలస్వామి, బద్వేల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సోమయ్య, జేఏసీ డివిజన్ కార్యదర్శి బాబు, మూరతోటి అలివేర్, జక్కుల గురయ్య, గిరిజన జేఏసీ మండల ఉపాధ్యక్షుడు ముత్యాల చినరాయుడు తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరులో సిమెంటు రోడ్ల నిర్మాణం



హైస్కూలు వరకు నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు

దువ్వూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జోక్యంతో దువ్వూరులోని పలు వీధుల్లో సిమెంటు రోడ్లు ఏర్పడుతున్నాయి. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మెయిన్ రోడ్డు నుంచి హైస్కూలు వరకు రూ.10 లక్షలు కేటాయించి రోడ్డు పనులు చేస్తున్నారు. దీంతో విద్యార్థుల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని ప్రజలు, అక్కడి ఉపాధ్యాయులు భావిస్తున్నారు. వాటితోపాటు గ్రామ పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో క్రిస్టియన్‌వాడలో రెండు చోట్ల సిమెంటు రోడ్డు నిర్మాణం జరిగింది. ఎన్నో రోజులుగా అధ్వాన్నంగా ఉన్న ఇక్కడి వీధుల్లో సిమెంటు రోడ్లు వేయడం పట్ల వాడలోని దళితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.21 లక్షలు కేటాయించి అధ్వాన్నంగా ఉన్న దువ్వూరు పంచాయతీలోని పలు వీధుల్లో సిమెంటు రోడ్లు నిర్మించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వెలిబుచ్చుతున్నారు.



మద్యం తాగి వాహనాలు నడపవద్దు

పోరుమామిళ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్ఐ బీఎన్ మూర్తి అన్నారు. శనివారం ఎస్ఐ కొండారెడ్డి ఆదేశాల మేరకు పోరుమామిళ్ల పోలీస్‌చెక్‌పోస్టు వద్ద వాహనాలు నడుపుతున్న వ్యక్తులను బ్రీత్‌ఎనలేజర్‌తో చెక్ చేసి, మద్యం తాగి ద్విచక్రవాహనాన్ని నడిపిన వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వాహనాన్ని సీజ్‌చేసి కేసు నమోదు చేశారు.

గిరిజన నేతకు సన్మానం

కొండాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా కొండాపురం గ్రామానికి చెందిన ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా మహిళా అధ్యక్షురాలు డేరా జ్యోతిని గిరిజన నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నందుకుగాను అనంతపురం టౌన్‌లో జ్యోతిని బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ చౌహాన్ చేతుల మీదుగా సన్మానించారు.

ఘనంగా తిరుమలనాథస్వామి గిరి ప్రదక్షిణ



అలంకారంలో తిరుమలనాథస్వామి

మైదుకూరు రూరల్, ఆగస్ట 9(ఆంధ్రజ్యోతి) : తిరుమలనాథస్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవ కార్యక్రమానికి శనివారం భక్తులు భారీగా పాల్గొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలనాథస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఆలయ నిర్వాహకుడు హజరత్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు పాల్గొన్నారు. గత నెల రోజులుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాలను సత్వరంగా పూర్తి చేసిన హజరత్‌రెడ్డి శనివారం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి ఆశీస్సులతో గిరి ప్రదక్షిణ మహోత్సవం ప్రారంభించారు. మైదుకూరు మండల ప్రజలేకాకుండా జిల్లాలోని భక్తులు తరలివచ్చి గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విశేష అలంకారంలో తిరుమలనాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వమించారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



ఆంజనేయస్వామి

కొండాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస మూడో శనివారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండాపురం, చౌటిపల్లె, దత్తాపురం, గండ్లూరు తదితర చోట్ల ఆంజనేయస్వామికి ఆకుపూజ. అభిషేకాలు నిర్వహించారు. చౌటిపల్లె ఆంజనేయస్వామి ఆలయంతో పటు పలుచోట్ల అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఘనంగా చౌడేశ్వరీ దేవి బిందెసేవ

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రూరల్ పరిదిలోని అమృతానగర్‌లో చౌడేశ్వరీదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను పురష్కరించుకుని రాత్రి బిందెసేవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవతామూర్తులకు పంచామృతాభిషేకం, లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ హోమం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, కలశపూజ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు, అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, పల్లా నరసయ్య, బండి వెంకటపతి, చౌడయ్య, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణానికి అవకాశం కల్పించాలని ఆల్‌ఆఫ్‌యూ దివ్యాంగుల సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ అబ్జల్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దివ్యాంగులకు మహిళలతోపాటు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాసినట్లు తెలిపారు. దివ్యాంగుల కుటుంబాలకు వంద యూనిట్ల వరకు ఉచిత కరెంటు సౌకర్యం కల్పించి సదరం సర్టిఫికెట్లు ఉన్న వారికి 35 కేజీల అంత్యోదయ రేషన్‌కార్డు మంజూరు చేయాలని కోరారు. 70 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు త్రీవీలర్ మోటారు సైకిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా జడ్జిని కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు



తిరుపతి జిల్లా జడ్జి రామచంద్రను కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు

కొండాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా జడ్జి రామచంద్రను కొండాపురం ఎమ్మార్పీఎస్ నేతలు కలిశారు. శనివారం కొండాపురంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను కలిసి తమ సమస్యలను తెలిపినట్లు ఎమ్మార్పీఎస్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగసుబ్బరాయుడు, జయరాజు, మరెన్న,పెద్దన్న పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



ఎస్ఐకి రాఖీ కడుతున్న దృశ్యం

పోరుమామిళ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి వేడుకలు పోరుమామిళ్ల మండలంలో ఘనంగా జరిగాయి. శనివారం రాఖీపౌర్ణమిని పురస్కరించుకొని అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెల్లు అనురాగానికి, ఆప్యాయతకు మారుపేరుగా నిలుస్తూ రాఖీలు కట్టారు. పోరుమామిళ్లలోని బ్రహ్మకుమారిలు ఎస్ఐ కొండారెడ్డికి రాఖీ కట్టారు. మండలంలో రాఖీపౌర్ణమి వేడుకలు నిర్వహించుకున్నారు.

సౌభ్రాతృత్వానికి ప్రతీక రాఖీ పండుగ



ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు సౌభాతృత్వానికి ప్రతీక రాఖీ పండుగ అని బ్రహ్మకుమారీలు శాంత, సౌజన్య పేర్కొన్నారు. శనివారం రాఖీ పండుగను పురష్కరించుకుని తెలుగుదేశం పార్టీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రాఖీ కట్టారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులకు వద్దిబాలుడులకు రాఖీలు కట్టారు.

14న మండల సర్వసభ్య సమావేశం

బద్వేలు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సభాభవనంలో ఈ నెల 14న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లీశ్వరి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులతో పాటు అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

